రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్త!

- నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోతున్న పాదచారులు
- అప్రమత్తత అవసరమంటున్న పోలీసులు



బంజారాహిల్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): "క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ఏపీ నుంచి వచ్చిన ఓ కుటుంబం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లో రోడ్డు దాటుతుండగా ఓ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సిగ్నల్ వ్యవస్థ గురించి అవగాహన లేకపోవడంతో ఆ కుటుంబం వాహనాలు చూసుకోకుండా రోడ్డు దాటినట్టు విచారణలో తేలింది."

"జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ ముందు పాదచారులు కోసం ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఉంది. ఇటీవల ఓ మహిళ దగ్గరిదారిలో రోడ్డు దాటేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలోనే ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొనడంతో మృతిచెందింది."

"అర్ధరాత్రి సమయంలో పంజాగుట్ట మోడల్ హౌస్ వద్ద వృద్ధ దంపతులు రోడ్డు దాటుతుండగా కారు వచ్చి ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వృద్ధుడు కాలు పోగొట్టుకున్నాడు."

ఇవే కాదు.. నగరంలోని చాలా ప్రాంతాల్లో పాదచారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ఠాణాల పరిధిలో ఇటీవల ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. పాదచారుల రక్షణ కోసం ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నా ప్రమాదాలలో మృతుల సంఖ్య తగ్గడం లేదు. నగరంలో గతేడాది చూస్తే దాదాపు 98 మందికి పైగా ఇలా రహదారిని దాటుతూ ప్రమాదాల బారిన పడి మృతిచెందిన వారు ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ప్రమాదం జరిగిన చాలా సంఘటనల్లో నిర్లక్ష్యం, దగ్గరి దారిలో రహదారిని దాటే క్రమంలో ప్రమాదానికి గురవడం, చరవాణులు మాట్లాడుతూ దాటడం, వాహన వేగాన్ని అంచనా వేయలేక తికమకపడి మృత్యువాతపడుతున్నట్లు తెలుస్తోంది. అనేక మంది గాయపడుతున్నారు.

చూసుకొని వెళ్లండి

పాదచారుల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారని పోలీసులు చెబుతున్నారు. రహదారులను దాటే క్రమంలో పాదచారులు కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలని వారు సూచించారు.

- రోడ్డు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి.
- ట్రాఫిక్ సిగ్నల్ గమనించి ముందుకు సాగాలి.
- యూటర్న్‌లు ఉన్న ప్రాంతాల్లో రహదారులను దాటడం అంత శ్రేయస్కరం కాదు. అక్కడ వాహనాలు వేగంగా కదులుతుంటాయి.
- పాదచారులు జంక్షన్లలో సూచించిన జీబ్రా మార్గంలోనే దాటాలి.
- పాదచారులు గుంపులుగా దాటడం మేలు.
- రోడ్డు దాటేటప్పుడు చేయి ఎత్తి చూపుతూ దాటాలి.

అంచనా వేయలేక..

పాదచారుల రక్షణ కోసం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే బంజారాహిల్స్‌లోని కేబీఆర్ ఉద్యానం-19 వద్ద జీబ్రా లేన్లు, పాదచారులు వేచి ఉండడానికి ప్రత్యేక ప్రాంతాలను, నాలుగు కూడళ్లలో దాటడానికి అనువైన మార్గాలను ఏర్పాటు చేశారు. ఇక్కడే కాకుండా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులోనూ ఇలాంటి చర్యలు చేపట్టారు. అలాగే, మెట్రో కారిడార్ ఉన్న ప్రాంతంలో పాదచారులు మధ్యవిభాగినులు దాటకుండా ఇటీవలి కాలంలో మధ్యమధ్యలో ఉన్న దారులను మూసివేశారు. దీనికితోడు పాదచారుల కోసం జూబ్లీహిల్స్‌లోని భవన్స్ పాఠశాల ముందు, బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.2లో ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రి, ముఫకంజా కళాశాలల ప్రాంతాల్లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేశారు. చాలామంది వాటిని ఎక్కి రహదారిని దాటలేక విభాగినులను దాటుకొని వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాలను గమనిస్తే మితిమీరిన వేగంతో జరిగే ప్రమాదాల శాతం దాదాపు 50 శాతానికి పైగా ఉంటుంది. అలాగే, నిర్లక్ష్యం, అతి వేగంతో జరిగే ప్రమాదాలు రెండోస్థానంలో ఉన్నాయి. ఈ సంఘటనల్లోనే పాదచారులు సైతం మృతిచెందుతున్నారు.

కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసుల సహాయం తీసుకోండి



రోడ్డు దాటే ముందర అన్నివైపులా చూసుకోవాలి. అప్పుడే ప్రమాదాల బారి నుంచి తప్పించుకోగలం. కూడళ్లతోపాటు ఎక్కడైనా ట్రాఫిక్ పోలీసులు కనిపిస్తే రోడ్డు దాటేందుకు వారి సహకారం తీసుకోండి. చాలా ప్రాంతాల్లో రోడ్డు దాటేందుకు ప్రత్యేకంగా జీబ్రా లైన్‌లు ఉన్నాయి. అక్కడ మాత్రమే రోడ్డు దాటాలి. జీబ్రా లైన్‌ల వద్ద వాహనాలు నెమ్మదిగా వెళ్తాయి. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నిమ్స్ లాంటి ప్రాంతాల్లో సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నాం.

● కట్టా హరిప్రసాద్, పంజాగుట్ట ట్రాఫిక్ ఏసీపీ



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పుష్పగుచ్ఛం ఇస్తున్న అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి

గవర్నర్‌ను కలిసిన అంబేడ్కర్ వర్సిటీ వీసీ

● 26వ స్నాతకోత్సవానికి ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను అంబేడ్కర్ విశ్వవిద్యాలయ అధికారులు శుక్రవారం రాజ్‌భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ.ఘంటా చక్రపాణి అభివృద్ధి పనులు, విశ్వవిద్యాలయ కార్యక్రమాలను వివరించారు. ఆగస్టు/సెప్టెంబర్‌లో జరగనున్న విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి అనుమతి కోరారు. కార్యక్రమానికి గవర్నర్‌ను ఆహ్వానించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొ.భోజు శ్రీనివాస్, ప్రజా సంబంధాల అధికారి డా.పి.వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.

గుర్రపుడెక్కను తొలగించేందుకు ప్రణాళికలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖైరతాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): 'దోమల బెడద తీరేదెన్నడు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం వచ్చిన కథనానికి జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. జోనల్ కార్యాలయంలో జరిగిన అధికారుల సమావేశంలో జోన్ సీనియర్ ఎంటమాలజిస్ట్ గంగప్ప తాజ్ బంజారా చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించేందుకు అవసరమైన ఎఫ్‌టీసీ యంత్రాలను, మరో డ్రోన్‌ను, రెండు వాహనాలను కేటాయించాలని జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలో ఈ పనులు చేపడతామని, అప్పటి వరకు తమ సిబ్బంది దోమల నివారణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారని గంగప్ప తెలిపారు.

'ప్రకృతి ఆయుర్వేదిక ఆరోగ్య సూత్రాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

ఎర్రగడ్డ, మే 23 (ఆంధ్రజ్యోతి): మెడిసిన్ మాఫియాకు విరుగుడుగా ప్రకృతి ఆయుర్వేదిక ఆరోగ్య సూత్రాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ప్రకృతి ప్రజాకవి జయరాజ్ అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డ గౌతమ్‌పురి కాలనీ పార్కులో ఈనెల 25న ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ ఈసీఈ ఆడిటోరియంలో జరిగే ప్రకృతి ఆరోగ్య మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేచురోపతి వైద్యులు వెంకట్, పీసీవీ స్వామి, వెంకన్న, జాలలింగయ్య, జాతీయ యోగా మాస్టర్ వరలక్ష్మి పాల్గొన్నారు.



సమ్మర్ ఉత్సవ్ మేళాలో సరదాగా ఫొటోలు దిగుతున్న సందర్శకులు

సెల్ఫీ స్పాట్‌గా సమ్మర్ ఉత్సవ్ మేళా

● సందర్శకులతో కిటకిటలాడుతున్న పీపుల్స్‌ప్లాజా

ఖైరతాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా ఓ వినూత్న తరహాలో నగరవాసులను ఆకట్టుకునే సమ్మర్ ఉత్సవ్ మేళా ఈసారి సైతం సందర్శకులను ఆకట్టుకుంటోంది. కేవలం వంద రూపాయల్లో విమానంలో దుబాయ్ వెళ్లి వచ్చిన అనుభూతిని పొందుతున్నారు. పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటైన సమ్మర్ మేళాలో సందర్శకులు సందడి చేస్తున్నారు. విమానంలో ఎక్కి ప్రయాణం చేస్తూ వింత మనుషులను చూస్తూ నేరుగా దుబాయ్‌లో దిగి బుర్జ్ ఖలీఫాను, అక్కడి సొయగాలను చూసేలా ఏర్పాటైన ప్రదేశాల్లో సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ నగరంలోనే ప్రస్తుతం ఒక సెల్ఫీ స్పాట్‌గా దీనిని అభివర్ణిస్తున్నారు. దీంతో పాటు అనేక రాష్ట్రాలకు చెందిన ఎన్నో రకాల వస్తువులు ఈప్రదర్శనలో ప్రదర్శనకు ఉంచారు. దీంతో పాటు కుటుంబసమేతంగా అందరూ సంతోషంగా గడిపేందుకు పలు రకాల ఎమ్యూజ్‌మెంట్లు, ఇష్టమైన వాటిని ఆరగించేందుకు ఫుడ్ కోర్టులు ఏర్పాటయ్యాయి. ప్రదర్శన ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకుడు మీర్జా రఫీక్‌బేగ్ తెలిపారు.

ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీగా ఎస్వీ రాఘవేంద్రరావు

అమీర్‌పేట, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీగా ఎస్వీ రాఘవేంద్రరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ నెల రోజులపాటు మాత్రమే ఏసీపీగా పనిచేసిన బాలగంగిరెడ్డి పేట్‌బషీరాబాద్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో రామగుండం స్పెషల్ బ్రాంచిలో ఏసీపీగా పనిచేస్తున్న ఎస్వీ రాఘవేంద్రరావును ఇక్కడకు బదిలీ చేశారు.

ఆస్తి పన్ను చెల్లించేలా పనిచేయాలి

ఖైరతాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను చెల్లించని వారిపై ఒత్తిడి తెచ్చి వెంటనే చెల్లించేలా అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్లు పనిచేయాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. శుక్రవారం ఆయన జోనల్ కార్యాలయంలో సర్కిళ్ల ఉపకమిషనర్లు, ఏఎంసీలు, ఎంటమాలజీ విభాగం అధికారులతో సమావేశమయ్యారు. ఇందులో అన్ని సర్కిళ్ల ఉప కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి.. నిందితుడి అరెస్ట్

బంజారాహిల్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగికదాడికి పాల్పడిన దూరపు బంధువును బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. లంగర్‌హౌజ్‌లో నివాసం ఉంటున్న కార్తీక్(34) ప్రైవేట్ ఉద్యోగి. ఆరు నెలల క్రితం భార్య గర్భవతిగా ఉన్న సమయంలో సాయం చేసేందుకు వచ్చిన బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన దూరపు బంధువైన బాలిక(17)ను ప్రేమిస్తున్నానంటూ లోబర్చుకుని కొన్నినెలలుగా లైంగికదాడికి పాల్పడ్డాడు. రెండు నెలల క్రితం బంజారాహిల్స్‌లోని నివాసం నుంచి బాలికను తీసుకెళ్లాడు. ఈ వ్యవహారంపై బాలిక తల్లి ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికను బంధువుల ఇంటికి తీసుకెళ్లినట్లు తేలడంతో పోలీసులు ఆమెను గుర్తించి తీసుకువచ్చారు. బాలిక ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం మైనర్ మీద లైంగికదాడి చేసినట్లు తేలడంతో నిందితుడు కార్తీక్ మీద పోక్సో కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

విద్యుత్ బిల్లు పేరుతో మోసం

● పోలీసులకు ఆర్మీ అధికారి ఫిర్యాదు

బంజారాహిల్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లు బకాయి చెల్లించాలంటూ సైబర్ నేరగాళ్లు విశ్రాంత ఆర్మీ అధికారిని మోసం చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.10 ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో నివసించే ఘన్‌శ్యాంపాండే విశ్రాంత ఆర్మీ అధికారి. మూడు రోజుల క్రితం ఆయనకు ఓ వ్యక్తి ఫోన్ చేసి విద్యుత్ బిల్లు బకాయి ఉందని చెప్పాడు. వెంటనే చెల్లించాలని లింక్ పంపించగా, దాని ద్వారా రూ.46 వేలు చెల్లించాడు. కొద్దిసేపటి తర్వాత ఆ లింక్ సైబర్ నేరగాళ్లు పంపించిందని తెలిసింది. ఆయన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని దుర్భాషలాడిన ముగ్గురిపై కేసు నమోదు

బంజారాహిల్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): యువతిని దుర్భాషలాడిన ముగ్గురి పై కేసు నమోదైంది. కొత్తగూడెంకు చెందిన రామగిరి నవ్య ఓ ప్రైవేట్ ఛానల్‌లో న్యూస్ ప్రజెంటర్‌గా పనిచేస్తుంది. సోమాజిగూడలోని ఓ ప్రైవేట్ హాస్టల్ లో ఉండగా, రూమ్‌మేట్ అలేఖ్యతో చిన్న విషయంలో గొడవ జరిగింది. దీంతో నవ్య మరో హాస్టల్‌కు మారింది. ఇదిలా ఉండగా, ఈనెల 19న అలేఖ్య పలుమార్లు ఫోన్ చేసింది. నవ్య పనిలో ఉండి చూసుకోలేదు. కొద్దిసేపటికి కులం పేరుతో దూషిస్తూ అలేఖ్య మెసేజ్ పెట్టింది. ఈనెల 22న అలేఖ్య ఆమె తల్లిదండ్రులు నవ్యకు ఫోన్ చేసి దుర్భాషలాడారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి



సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కిషన్‌రెడ్డి

పంజాగుట్ట, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని, ఆంధ్రప్రదేశ్‌లోని సైనిక్ స్కూళ్లలో తెలంగాణ విద్యార్థులకు అవకాశం కల్పించాలని క్రాంతి కీన్ ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శి కళ్యాణి అన్నారు. పలువురు విద్యార్థులు, ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం రాజ్‌భవన్ రహదారిలోని దిల్‌కుష్ గెస్ట్‌హౌస్‌లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఏపీ సైనిక్ స్కూళ్లలో తెలంగాణ విద్యార్థులకు అవకాశం కల్పించాలని, రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరారు. తమ సంస్థలో చదువుతున్న 50 మంది విద్యార్థులు సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. తమ వినతిపై కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, రాబోయే సంవత్సరంలోపు రాష్ట్రంలో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేసేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌ను ఢిల్లీకి వెళ్లి కలిశామని, ఆయన కూడా స్పందించి తెలంగాణకు సైనిక్ స్కూల్ ఇచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబును కూడా కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పీఎస్ఆర్ క్రాంతి, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

భారత్ సత్తా ప్రపంచ దేశాలకు..

ఖైరతాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌తో భారత సైన్యం మరోసారి తమ వ్యూహాత్మక నైపుణ్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాల సందర్భంగా శుక్రవారం ఖైరతాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో సెన్సేషన్ సినిమా థియేటర్ నుంచి రైల్వేగేట్ చౌరస్తా వరకు తిరంగా యాత్ర జరిగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, సెంట్రల్ జోన్ అధ్యక్షుడు లంకెల దీపక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రేంసింగ్ రాథోడ్, నాయకులు బద్దం మహిపాల్‌రెడ్డి, శ్రీధర్, ప్రేంరాజ్, రామ్మోహన్‌రావు, వీణామాధురి, శ్రవణ్ యాదవ్, వైద్యనాథ్, చంద్రుబాబా, చక్రవర్తి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌కు వినతి



శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ భోర్ఖడేకు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ దేదీప్య

వెంగళరావునగర్/బోరబండ, మే 23 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ లోని పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ దేదీప్య కోరారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి జోన్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. జోనల్ కమిషనర్ హేమంత్ భోర్ఖడేకు పెండింగ్ సమస్యలు, తదితర అంశాలపై వినతిపత్రం అందజేశారు. రుతుపవనాలు రానున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, ఆస్తి పన్ను, పారిశుధ్యం, వ్యర్థాల తరలింపు, గ్రీన్ వేస్ట్, దోమల నివారణ తదితర వాటిపై చర్చించారు. బడ్జెట్ లేకపోవడంతో వెంగళరావునగర్ అయ్యప్ప మైదానంలో బహుళ ప్రయోజన ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులు ఆగిపోయాయని చెప్పారు. రూ.6 కోట్ల వ్యయంతో జవహర్‌నగర్ మైదానంలో బహుళ ప్రయోజన ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి 2023లోనే స్టాండింగ్ కమిటీ అనుమతి ఇచ్చిందని, ప్రస్తుతం ఆర్థిక విభాగంలో కూడా పెండింగ్‌లో ఉందని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. జవహర్‌నగర్‌లో ఆధునిక మార్కెట్, శ్మశానవాటికను మంజూరు చేయాలని ఆమె కోరారు. కాగా, రహ్మత్‌నగర్ డివిజన్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ భోర్ఖడేను కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి కోరారు. జోనల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో కమిషనర్‌కు కార్పొరేటర్ వినతిపత్రం ఇచ్చారు. రహ్మత్‌నగర్ జంక్షన్ అభివృద్ధి పనులను చేపట్టాలని, ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణంలో ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, బస్తీల్లో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, ట్యాక్స్ తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పంజాగుట్ట, మే 23 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 11కేవీ భరత్‌నగర్ ఫీడర్ పరిధిలోని హెచ్‌పీ రోడ్డు, లక్ష్మీకళ, శ్రీరాములు సినిమా థియేటర్స్, అశ్విని హెయిర్ ఆయిల్ లైన్ ప్రాంతాల్లోనూ, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ బేగంపేట నాలా, ఆర్‌బీఐ క్వార్టర్స్ ఫీడర్ల పరిధిలోని తాతాచారి కాలనీ, బాంబే హల్వా కాంపౌండ్, పోచమ్మ బస్తీ, ఆర్‌బీఐ క్వార్టర్స్, గురుమూర్తి లైన్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.



యాప్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్

బ్యాడ్మింటన్ అభిమానులకు వేదికగా యాప్

రాయదుర్గం, మే 23 (ఆంధ్రజ్యోతి): భారత బ్యాడ్మింటన్ ఆటగాళ్లను, అభిమానులను ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు ఫ్యాన్‌లీ యాప్‌ను రూపొందించారు. గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ యాప్‌ను బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాడ్మింటన్ ఇండియా పేరుతో దేశంలోని అగ్రశ్రేణి ఆటగాళ్లు, యువ ప్రతిభావంతులు, అభిమానులు ఒకే డిజిటల్ వేదిక పైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఫ్యాన్‌లీ కమ్యూనికేషన్స్ ఇండియా ఫౌండర్ మాట్లాడుతూ.. దేశంలో బ్యాడ్మింటన్ క్రీడకు ఎంతో ఆదరణ లభిస్తున్నా, మొత్తం కమ్యూనిటీని కలిపే ఒక వేదిక ఇంత వరకు ఏర్పాటు కాలేదన్నారు. ఇప్పుడు ఫ్యాన్‌లీ ఆ లోటును తీర్చుతుందన్నారు. జాతీయ స్థాయి నుంచి పాఠశాల స్థాయి వరకు ఆటగాళ్లను అభిమానించే వారందరికీ ఫ్యాన్‌లీ ఒక ఇల్లుగా మారుతుందన్నారు. ఈ యాప్‌ను యాపిల్, గూగుల్ ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన సూచించారు.

బీజేఎంసీ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నాగార్జున

పంజాగుట్ట, మే 23 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా మజ్దూర్ సెల్(బీజేఎంసీ) రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నాగార్జునను నియమించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు అర్జున్ చటర్జీ నియామక పత్రం అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగార్జున మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. సంస్థ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎం.భాగ్యలక్ష్మి నియమితులయ్యారు.

రక్షణశాఖకు భవన నిర్మాణాల ముసాయిదా

- అభివృద్ధి పనులపై చర్చ
- కంటోన్మెంట్ సమావేశంలో పలు నిర్ణయాలకు ఆమోదం

సికింద్రాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నూతన భవన నిర్మాణాల ముసాయిదాలో అధికారులు మరోసారి మార్పులు చేశారు. గతంలో రూపొందించిన ముసాయిదాలో మార్పులు చేయాలని రక్షణ శాఖ సూచించింది. దీనికి అనుగుణంగా అధికార యంత్రాంగం మార్పులు చేసింది. ఈ ముసాయిదాను రక్షణ శాఖకు పంపించాలని పాలకమండలి సమావేశంలో నిర్ణయించారు. కంటోన్మెంట్ పాలకమండలి సమావేశం బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ నంజుండేశ్వర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశంలో కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద, స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్, కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి మధుకర్ నాయక్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి పలు అంశాలకు ఆమోదం తెలిపారు. అధికారులు సూచించిన వాటిలో కొన్నింటిని ఎమ్మెల్యే వ్యతిరేకించారు. అదేవిధంగా దోబీఘాట్‌లోని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్లేగ్రౌండ్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి ఇవ్వాలని బోర్డు


కంటోన్మెంట్ కార్యాలయం

పాలక మండలి నిర్ణయించింది. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వహణ తమ ఆధ్వర్యంలోనే కొనసాగుతుందని బోర్డు అధ్యక్షుడు నంజుండేశ్వర్, సీఈఓ మధుకర్ నాయక్‌లు తెలిపారు. దీనిని ఎమ్మెల్యే శ్రీగణేశ్ వ్యతిరేకించారు. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహణ బాధ్యతలు ఉండాలని ప్రతిపాదించారు. చర్చల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, రక్షణశాఖ, కంటోన్మెంట్ బోర్డు అధికారులు సభ్యులుగా ఉండేలా ఓ కమిటీ ఏర్పాటు చేసి, కమిటీ ఆధ్వర్యంలో నిర్వహణ జరగాలని నిర్ణయించారు. బోయినపల్లిలో నేతాజీ స్కూల్ భవన స్థలంలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్, సరస్వతి విద్యాపీఠం ఏర్పాటు చేయాలని ఎంపీ ఈటల రాజేందర్ ప్రతిపాదిస్తున్నారని సీఈఓ మధుకర్ నాయక్ తెలిపారు. సరస్వతి విద్యాపీఠం నిర్వాహకులు ఉచితంగా విద్యను అందిస్తే పాఠశాల నిర్మాణానికి తమకు అభ్యంతరం లేదని ఎమ్మెల్యే వెల్లడించారు. సిక్‌విలేజీ జంక్షన్ సర్కిల్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలని కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద కోరారు. దీన్ని ఎమ్మెల్యే వ్యతిరేకించారు. విగ్రహ ఏర్పాటుకు తాను వ్యతిరేకం కాదని, వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగే జంక్షన్‌లో విగ్రహం ఏర్పాటు చేయడం వలన ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు కూడా జరిగే అవకాశాలు ఉంటాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ సమస్యలు, విన్నపాలు, అభ్యంతరాల కోసం అమలులో ఉన్న కంటోన్మెంట్ పోర్టల్‌లో మరి కొన్ని మార్పులు చేస్తున్నామని, త్వరలో డీజీడీఈ దీనిని ప్రారంభిస్తారని మధుకర్ నాయక్ తెలిపారు.

పలు అంశాలకు ఆమోదం..

వర్షాకాలం విపత్తులను ఎదుర్కొనేందుకు, నాలాల పూడికతీత, తదితర పనులకు నూతన యంత్ర పరికాలను అద్దెకు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. బొల్లారంలోని కంటోన్మెంట్ ఆస్పత్రికి మందుల సరఫరాకు ఈ-టెండర్ నిర్వహణపై చర్చించారు. కంటోన్మెంట్‌లో మంచినీటి సరఫరా మెరుగుకు, అదనపు నీటి సరఫరాకు, నూతన రిజర్వాయర్ల నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించడానికి సుముఖంగా ఉన్నారని ఆయన తెలిపారు. అందుకు కావలసిన స్థలాలు రక్షణ శాఖ కేటాయిస్తే సరిపోతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాలనీలు, బస్తీల్లో వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని కోరారు. పలు కాలనీలు, బస్తీల్లో నూతన రోడ్ల నిర్మాణానికి, మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణానికి రూపొందించిన అంచనాలను పాలక మండలి ఆమోదించింది.


సైబర్ నేరాలు, సామాజిక దురాచారాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ మధుకుమార్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- గోపాలపురం సీఐ మధుకుమార్

రెజిమెంటల్‌బజార్, మే 23 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోపాలపురం సీఐ మధుకుమార్ సూచించారు. సైబర్ క్రైం, డ్రగ్స్, సామాజిక దురాచారాలపై రెజిమెంటల్‌బజార్ వాసులకు శుక్రవారం సేఠ్ బన్వర్‌లాల్ స్కూల్ ఆవరణలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలకు, సామాజిక దురాచారాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, స్థానికులు పాల్గొన్నారు.


బాలకిష్టారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఓయూ జేఏసీ చైర్మన్ తిరుపతి

బీటెక్ సీట్లను అమ్ముకుంటున్న కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి

- ఓయూ జేఏసీ చైర్మన్ తిరుపతి

తార్నాక, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ బీ కేటగిరి నోటిఫికేషన్‌ను విడుదల చేయకముందే కొన్ని ఇంజనీరింగ్ కాలేజీలు బీటెక్ సీట్లను అమ్ముకుంటున్నాయని, అలాంటి కాలేజీల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డిని వినతి పత్రం అందజేశారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యం రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించకుండా, బీ కేటగిరి ద్వారా బీటెక్ సీట్లను అమ్ముకుంటూ వందల కోట్లు దండుకుంటూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నత విద్యామండలి చైర్మన్, వైస్ చైర్మన్ స్పందించి అక్రమాలకు పాల్పడుతున్న ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కొత్తపల్లి తిరుపతి కోరారు.

ఎస్ఆర్‌నగర్ ఏసీపీగా రాఘవేంద్రరావు బాధ్యతలు


రాఘవేంద్ర రావు

అమీర్‌పేట, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్ ఏసీపీగా ఎస్వీ రాఘవేంద్రరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రామగుండం స్పెషల్ బ్రాంచ్‌లో ఏసీపీగా పనిచేస్తున్న ఎస్వీ రాఘవేంద్రరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. భారత్- పాక్ మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏసీపీకి అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.



యాప్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్

బ్యాడ్మింటన్ అభిమానులకు వేదికగా యాప్

రాయదుర్గం, మే 23 (ఆంధ్రజ్యోతి): భారత బ్యాడ్మింటన్ ఆటగాళ్లను, అభిమానులను ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు ఫ్యాన్‌లీ యాప్‌ను రూపొందించారు. గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ యాప్‌ను బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాడ్మింటన్ ఇండియా పేరుతో దేశంలోని అగ్రశ్రేణి ఆటగాళ్లు, యువ ప్రతిభావంతులు, అభిమానులు ఒకే డిజిటల్ వేదిక పైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఫ్యాన్‌లీ కమ్యూనికేషన్స్ ఇండియా ఫౌండర్ మాట్లాడుతూ.. దేశంలో బ్యాడ్మింటన్ క్రీడకు ఎంతో ఆదరణ లభిస్తున్నా, మొత్తం కమ్యూనిటీని కలిపే ఒక వేదిక ఇంత వరకు ఏర్పాటు కాలేదన్నారు. ఇప్పుడు ఫ్యాన్‌లీ ఆ లోటును తీర్చుతుందన్నారు. జాతీయ స్థాయి నుంచి పాఠశాల స్థాయి వరకు ఆటగాళ్లను అభిమానించే వారందరికీ ఫ్యాన్‌లీ ఒక ఇల్లుగా మారుతుందన్నారు. ఈ యాప్‌ను యాపిల్, గూగుల్ ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన సూచించారు.


బౌద్ధనగర్: చిలకలగూడలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి


బేగంపేట: సోమాజిగూడలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రక్షణ వ్యవస్థలో భారత్ నంబర్‌వన్

- బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

బౌద్ధనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో భారత రక్షణ వ్యవస్థ ప్రపంచంలో నంబర్ వన్ స్థానంలో ఉందని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు నరేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం చిలకలగూడలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలు పట్టుకుని పలు ప్రాంతాల్లో తిరిగారు. ఈ సందర్భంగా భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సారంగపాణి హాజరై మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతానికి గుర్తుగా అన్ని ప్రాంతాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని తుద ముట్టించడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పీవోకేను భారత్‌కు పాకిస్తాన్ బేషరతుగా అప్పగించాలన్నారు. వీరమరణం పొందిన అమరవీరులకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకట్ల హరి, ప్రభుగుప్తా, భాస్కరగిరి, ఆకారం రమేష్, అంబాల రాజేశ్వరరావు, చోటాప్రభు, సురేష్, సతీష్, ఈఎల్ ప్రతాప్, అజయ్ పాల్గొన్నారు.

పార్శిగుట్టలో

ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, త్రివిధ దళాలకు సెల్యూట్ చేస్తూ బౌద్ధనగర్ డివిజన్ పార్శిగుట్టలో శుక్రవారం బీజేపీ నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. న్యూఅశోక్‌నగర్, సంజీవపురం, పార్శిగుట్ట మీదుగా ర్యాలీ కొనసాగింది. బీజేపీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, వీఎస్ రాజు, దత్తు, లడ్డు, చైతన్య, సంపత్, శ్యామ్, సతీశ్, అమరావతి, సుశీల పాల్గొన్నారు.

బేగంపేటలో..

బేగంపేట: ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన జవాన్లకు మద్దతుగా సోమాజిగూడలోని బీఎస్ మక్తాలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సూర్యవినాయక్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, వేణు, స్వరాజ్, గోపీ, రాహుల్ పాల్గొన్నారు.

తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి

- కేంద్ర మంత్రిని కోరిన క్రాంతి కీన్ ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శి కళ్యాణి
- సానుకూలంగా స్పందించిన కిషన్‌రెడ్డి

పంజాగుట్ట, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని, ఆంధ్రప్రదేశ్‌లోని సైనిక్ స్కూళ్లలో తెలంగాణ విద్యార్థులకు అవకాశం కల్పించాలని క్రాంతి కీన్ ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శి కళ్యాణి అన్నారు. పలువురు విద్యార్థులు, ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం రాజ్‌భవన్ రహదారిలోని దిల్‌కుష్ గెస్ట్ హౌస్‌లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఏపీ సైనిక్ స్కూళ్లలో తెలంగాణ విద్యార్థులకు అవకాశం కల్పించాలని, రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరారు. తమ సంస్థలో చదువుతున్న 50 మంది విద్యార్థులు సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. తమ వినతిపై కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, రాబోయే సంవత్సరంలోపు రాష్ట్రంలో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేసేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేఠ్‌ను ఢిల్లీకి వెళ్లి కలిశామని, ఆయన కూడా స్పందించి తెలంగాణకు సైనిక్ స్కూల్ ఇచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబును కూడా కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఆమె తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధులు పీఎస్ ఆర్ క్రాంతి, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కిషన్‌రెడ్డి

భారత్ సత్తా ప్రపంచ దేశాలకు..

ఖైరతాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌తో భారత సైన్యం మరోసారి తమ వ్యూహాత్మక నైపుణ్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాల సందర్భంగా శుక్రవారం ఖైరతాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో సెన్సేషన్ సినిమా థియేటర్ నుంచి రైల్వేగేట్ చౌరస్తా వరకు తిరంగా యాత్ర జరిగింది. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, సెంట్రల్ జోన్ అధ్యక్షుడు దీపక్‌రెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, శ్రీధర్, రామ్మోహన్‌రావు, వీణామాధురి, శ్రవణ్ యాదవ్, వైద్యనాథ్, చంద్రుబాబా, చక్రవర్తి పాల్గొన్నారు.

దళిత క్రిస్టియన్ విద్యార్థిపై దాడి హేయమైన చర్య

- క్రిస్టియన్ స్టూడెంట్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు అశోక్

తార్నాక, మే 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి యూనివర్సిటీకి చెందిన దళిత క్రిస్టియన్ విద్యార్థి జేమ్స్‌పై తోటి విద్యార్థులు విచక్షణా రహితంగా దాడి చేయడం హేయమైన చర్య అని క్రిస్టియన్ స్టూడెంట్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు గడ్డం అశోక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం తార్నాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేమ్స్‌పై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని ఆరోపించారు. క్రిస్టియన్‌లకు రక్షణ లేకుండా పోయిందని, ప్రతిరోజు ఎక్కడో ఒకచోట క్రిస్టియన్లపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఏపీ ప్రభుత్వం స్పందించి తిరుపతి ఘటనకు కారకులైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.


పరేడ్‌గ్రౌండ్ ఎదురుగా పెట్రోల్ బంక్ వద్ద నిలిచిన వర్షపునీరు

మారని జీహెచ్ఎంసీ తీరు

- ప్రధాన రహదారులపై నిలిచిన వర్షపు నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సికింద్రాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం అధికారుల తీరు మారడం లేదు. చిరుజల్లులకే ప్రధాన రహదారులు వర్షపు నీటితో నిండిపోతున్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ సర్కిల్, స్విమ్మింగ్‌పూల్, పరేడ్‌గ్రౌండ్, జింఖానా మైదానం ఎదురుగా, సీటీవో జంక్షన్, ప్యారడైజ్ ఫైర్ స్టేషన్ తదితర పాయింట్లలో వర్షపు నీరు నిలిచింది. ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీటిలో నడిచేదెలా అంటూ అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోరా అంటూ వారిపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వర్షపు నీరు నిలిచే పాయింట్లను గుర్తించి, శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. లేని పక్షంలో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


అదృశ్యమైన భిక్షపతి

బోయినపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కల్పన తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ బోయినపల్లి ఎస్కే ఫంక్షన్ హాల్ వద్ద నివాసం ఉండే గూడూరు భిక్షపతి (32) కూలీ పని చేస్తూ కుటుంబసభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా అతను మద్యానికి బానిసయ్యాడు. మూడు రోజుల క్రితం మద్యం సేవించిన భిక్షపతి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులను, తెలిసిన వారిని ఆరా తీశారు. ఎలాంటి సమాచారం అందకపోవడంతో భిక్షపతి తల్లి యాదమ్మ శుక్రవారం బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

విద్యుత్ బిల్లు పేరుతో మోసం

- పోలీసులకు ఆర్మీ అధికారి ఫిర్యాదు

బంజారాహిల్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లు బకాయి చెల్లించాలంటూ సైబర్ నేరగాళ్లు విశ్రాంత ఆర్మీ అధికారిని మోసం చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.10 ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో నివసించే ఘన్‌శ్యాంపాండే విశ్రాంత ఆర్మీ అధికారి. మూడు రోజుల క్రితం ఆయనకు ఓ వ్యక్తి ఫోన్ చేసి విద్యుత్ బిల్లు బకాయి ఉందని చెప్పాడు. వెంటనే చెల్లించాలని లింక్ పంపించగా, దాని ద్వారా రూ.46 వేలు చెల్లించాడు. కొద్దిసేపటి తర్వాత ఆ లింక్ సైబర్ నేరగాళ్లు పంపించిందని తెలిసింది. ఆయన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీ జాబ్స్ పేరిట మోసం

- నిందితుడి అరెస్టు, రిమాండ్


సురేశ్

కొత్తపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్, ఐటీ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నగదు కాజేసిన పాత సైబర్ నేరస్థుడిని రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన పోలవరపు సురేశ్(32) ఓ పాత సైబర్ నేరస్థుడు. గతంలో రెండు సైబర్ క్రైమ్ కేసుల్లో అరెస్టయి జైలు నుంచి విడుదలయ్యాడు. బయటికి వచ్చిన అతని తీరు మారలేదు. మళ్లీ సైబర్ మోసాలు చేయడం మొదలుపెట్టాడు. గడ్డిఅన్నారంలో ఉండే మహేశ్వరి బీటెక్ పూర్తిచేసి, ఉద్యోగ అన్వేషణలో ఉంది. సోషల్‌మీడియా వేదికగా సాఫ్ట్‌వేర్, ఐటీ సంస్థల్లో ఉద్యోగాలు చేయడానికి తనను సంప్రదించవచ్చని సురేష్ ప్రకటన ఇచ్చాడు. మహేశ్వరిని ఆన్‌లైన్‌లో పరిచయం చేసుకుని, టెక్ మహీంద్ర కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నానని నమ్మించాడు. సదరు కంపెనీలో జావా ప్రోగ్రామ్ డెవలపర్ ఉద్యోగం ఇప్పిస్తానని రెండు నెలల క్రితం ఆమెతో పాటు ఆమె స్నేహితుల స్టడీ డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించుకుని రూ.2.60లక్షలు కాజేశాడు. నకిలీ అపాయింట్‌మెంట్ పత్రాలు పంపించాడు. చెక్ చేసుకుని మోసపోయామని గుర్తించిన బాధితులు.. రాచకొండ సైబర్ క్రైమ్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన వారు సురేశ్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నిలువ నీడ కరువు

- అడ్డగుట్టలో లేని బస్ షెల్టర్లు
- రోడ్లపైనే జనం పడిగాపులు
- పట్టించుకోని అధికారులు

అడ్డగుట్ట, మే 23 (ఆంధ్రజ్యోతి): సిటీలో ఆర్టీసీ ప్రయాణికులకు నిలువనీడ కరువవుతోంది. ముఖ్యంగా అడ్డగుట్ట డివిజన్‌లో చాలా బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు రోడ్లపైనే నిలబడాల్సి వస్తోంది. నిలువ నీడ లేక జనం దుకాణసముదాయాలు, చెట్లను ఆశ్రయిస్తున్నారు. ఇటు పాలకులు, అటు ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు.

బస్‌షెల్టర్లు లేక బాధలు..

అడ్డగుట్ట డివిజన్‌లోని పలు ప్రధాన కూడళ్ల వద్ద బస్ షెల్టర్లు లేకపోవడం కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తుకారాంగేట్ చౌరస్తా, రియో హోటల్, అడ్డగుట్ట చౌరస్తాలో మూడు ప్రధాన కూడళ్లు ఉన్నాయి. నలభై ఏళ్ల నుంచి ఇక్కడ బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం అడ్డగుట్టలో 46,230 మంది జనాభా ఉంది. ఈ ప్రాంతం నుంచి వివిధ పనుల నిమిత్తం వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థులు, కూరగాయ వ్యాపారులు, మహిళలు నిత్యం సికింద్రాబాద్, ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు. ఎండలో నిలబడలేక బస్సు వచ్చేంత వరకు దుకాణ సముదాయాలను, చెట్లను ఆశ్రయించాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ఈ మూడు బస్టాపుల్లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


తుకారాంగేట్ చౌరస్తాలో లేని బస్ షెల్టర్


రియో పాయింట్ హోటల్ వద్ద లేని బస్ షెల్టర్

అధికారులకు ఫిర్యాదు చేశాం



అడ్డగుట్ట డివిజన్‌లోని తుకారాంగేట్, రియో హోటల్, అడ్డగుట్ట చౌరస్తాలో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని చాలా సార్లు కంటోన్మెంట్ ఆర్టీసీ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాం. అయినా అధికారులు స్పందించడం లేదు. అధికారులు వెంటనే ఈ మూడు ప్రాంతాలను విజిట్ చేసి బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నా.

\- నక్కల శోభ, అడ్డగుట్ట

చాలా కష్టంగా ఉంది



బస్ షెల్టర్ లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. వృద్ధులు, దివ్యాంగులు ఎండలో నిలబడలేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. బస్సు వచ్చే వరకు దుకాణసముదాయాల దగ్గర నిలబడుతున్నాం. వారు ఎక్కువ సేపు ఉండనివ్వడం లేదు. ప్రయాణికుల కష్టాలను అర్థం చేసుకుని ఈ ప్రాంతాల్లో బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

\- రాధిక, అడ్డగుట్ట